క్లుప్తంగా

మాంసం విక్రయదారులు జాగ్రత్తలు పాటించాలి

అంబాజీపేట: ప్రస్తుత వాతావరణంలో ప్రజలు రోగాల బారిన పడుతున్న నేపథ్యంలో మాంసం విక్రయదారులు తగిన జాగ్రత్తలు తీసుకుని వినియోగదారులకు విక్రయించాలని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్‌ఓ. బి.అప్పారావు అన్నారు. స్థానికంగా విక్రయిస్తున్న మాంసం విక్రయ షాపులను ఆదివారం తనిఖీ చేశారు. మాంసం విక్రయదారులకు తగు సూచనలు చేశారు. మాంసంపై ఈగలు, దోమలు, విషపురుగులు వాలకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పాడైన మాంసంను విక్రయిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

నిత్యాన్నదానానికి రూ.10,116 విరాళం


దాత హరికట శ్రీవేద్‌కు స్వామి చిత్రపటం అందజేస్తున్న అర్చకుడు

అయినవిల్లి: స్థానిక విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి రాజమహేంద్రవరానికి చెందిన హరికట శ్రీవేద్ ఆదివారం రూ.10,116 విరాళం అందజేశారు. ఈ సొమ్మును ఆలయ అర్చకుడు సత్తిబాబుకు అందజేశారు. దాతను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం


కొత్తపేట సత్యసాయి నిలయంలో మహిళలకు సత్కారం

కొత్తపేట: భగవాన్ సత్యసాయిబాబా వారి స్ఫూర్తితో సమాజ సేవా కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్ బూసి జయలక్ష్మి అన్నారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలు పురస్కరించుకుని నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. సేవాతత్పరులైన మహిళలను గుర్తించి వారిని సత్కరించారు. సత్యసాయి సేవా సమితి కన్వీనర్ కంకటాల సత్యనారాయణ (కేఎస్ఎన్) ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ జయలక్ష్మి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వైద్య ఆరోగ్య శాఖ డివిజనల్ అధికారి డాక్టర్ మెంటే సుమలత, జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏఎస్ఎస్ రమాదేవి, భగవద్గీత పఠనంతో గణపతి సచ్చిదానంద స్వామి నుంచి బంగారు పతకం పొందిన వాసవి ఆర్యవైశ్య మహిళా మండలి సభ్యులు శ్రీకాకోళ్లపు భార్గవి, కంచర్ల రాధాకుమారిలను సర్పంచ్, సత్యసాయి మహిళా విభాగం సభ్యులు ఘనంగా సత్కరించారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కృషి


పెదపళ్లలో సచివాలయ భవన శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు తదితరులు

ఆలమూరు: గ్రామీణ సమగ్రాభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండలంలోని పెదపళ్ల, పినపళ్లలో రూ.1.07 కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి బండారు శ్రీనివాసుతో కలసి ఆయన ప్రారంభించారు. అలాగే పెదపళ్లలో 17 మంది మహిళలకు ఇళ్ల పట్టాలను అందజేశారు. సర్పంచ్‌లు యేడిద సత్యశ్రీ, సంగిత సుభాష్, తోట భవాని, ఎంపీటీసీ నెక్కంటి ప్రమీల, త్రిసభ్య కమిటీ చైర్మన్ జాస్తి భాస్కరరావు, ఎంపీడీఓ ఎ.రాజు, గ్రామ కార్యదర్శి వి.వేణి తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన మత్స్యకారుడి మృతదేహం లభ్యం


రమేష్ (ఫైల్)

మామిడికుదురు: వేటకు వెళ్లి వైనతేయ గోదావరి నదిలో గల్లంతైన పాశర్లపూడి సత్తరువుతోటకు చెందిన మత్స్యకారుడు అంకాని రమేష్ (40) మృతదేహం అల్లవరం మండలం ఓడలరేవులో ఆదివారం లభ్యమైంది. శుక్రవారం మధ్యాహ్నం గోదావరి నదిలో రమేష్ వేటకు వెళ్లి గల్లంతయ్యాడని కుటుంబ సభ్యులు తెలిపారు. అప్పటి నుంచి అతని కోసం గాలిస్తుండగా మృతదేహం లభ్యమైందన్నారు. దీనిపై అల్లవరం ఎస్సై సంపత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రమేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఆస్పత్రికి తరలించారు.

దీపావళి.. ఆనందాల కేళి

- నేడే ఇంటింటా దీపాల పండగ
- ప్రతికూల వాతావరణం
- మందకొడిగా బాణసంచా విక్రయాలు


కొత్తపేటలో హోల్‌సేల్ బాణసంచా షాపును పరిశీలిస్తున్న అధికారులు

కొత్తపేట: బాలలు, యువతీ, యువకులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూసే దీపావళి పండగ వచ్చేసింది. పల్లెలు, పట్టణాల్లో పండగ సందడి నెలకొంది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా, చీకటిని పారదోలుతూ వెలుగులు నింపే వేడుకగా దీపావళి పండగను జరుపుకుంటారు. ఆశ్వయుజ మాస అమావాస్య రోజున వచ్చే ఈ పండగకు ఎంతో విశిష్టత ఉంది. దీపావళి రోజున ఏ ఇంటి ముందు దీపాలు సమృద్ధిగా వెలుగుతాయో ఆ ఇంట శ్రీమహాలక్ష్మి ప్రవేశిస్తుందని హిందువుల నమ్మకం. అందుకే దీపావళి రోజు చీకటి పడుతుందనగానే మహాలక్ష్మి పూజ చేసిన అనంతరం ఇంటా, బయటా దీపాలు వెలిగించి లక్ష్మీదేవికి స్వాగతం పలుకుతారు. అనంతరం ప్రధాన ఘట్టమైన బాణసంచా కాల్పులు ప్రారంభిస్తారు. ఈ పండగను పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రతి కుటుంబం తమ ఆర్థిక స్తోమతకు అనుగుణంగా బాణసంచా కొనుగోలు చేసి కాల్చడం ద్వారా పండగ జరుపుకొంటారు.

పర్యావరణ హితంగా..

ఒకప్పుడు దీపావళి అనగానే ఠక్కున గుర్తుకు వచ్చేవి టపాసులు. ఇలా చెప్పాలంటే యువకులు నెలరోజులు ముందు నుంచే సిసింద్రీలు, కొబ్బరి ఈనెలు, పేకముక్కలు, నారతో తారాజువ్వలు, చిన్నసైజు బాంబులు సొంతంగా తయారు చేసుకునేవారు. కొబ్బరిపొట్టు, ఉప్పుతో తిప్పుడు పొట్లాలు కట్టుకునేవారు. చిన్న పిల్లలు చిన్న చిన్న టపాసులు కాల్చేవారు. నెలల పాటు ఎక్కడో ఒకచోట టపాసుల శబ్దం వినిపిస్తూనే ఉండేది. మారుతున్న కాలానికి అనుగుణంగా యువకులు, చిన్నారుల్లో ఆ ఉత్సాహం తగ్గింది. ప్రజల్లో ఆలోచనా విధానం మారింది. టపాసులు కాల్చడం వలన శబ్దకాలుష్యంతో పాటు పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందన్న భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.

పెరిగిన ధరలు, తగ్గిన కొనుగోళ్లు

బాణసంచా ధరలకు రెక్కలొచ్చాయి. గతేడాదితో పోలిస్తే 20 నుంచి 30 శాతం మేర పెరిగి వినియోగదారులను బేజారెత్తిస్తున్నాయి. ముడిసరుకుల ధరలు, శివకాశి వంటి సుదూర ప్రాంతాల నుంచి బాణసంచా రవాణా చార్జీల పెరుగుదల, షాపుల నిర్వహణ ఖర్చులు వంటి కారణాలతో ధరలు పెరిగాయని, కొనుగోళ్లు కూడా బాగా తగ్గాయని వ్యాపారులు చెబుతున్నారు. రాను రానూ ప్రజల్లో బాణసంచా కాల్చాలన్న ఆసక్తి తగ్గిపోవడం, ప్రతికూల వాతావరణం అమ్మకాలపై ప్రభావం చూపిందని వాపోయారు.

జనావాసాలకు దూరంగా..

దీపావళి బాణసంచా దుకాణాలు జనావాసాల మధ్య, రోడ్ల పక్కన, ఎక్కడపడితే అక్కడ బాణసంచా విక్రయాలు సాగించకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. దానిలో భాగంగా డివిజన్ కేంద్రం కొత్తపేటలో గత కొన్నేళ్లుగా గ్రామం మధ్య స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో రిటైల్ (తాత్కాలిక లైసెన్స్) దుకాణాలు ఏర్పాటు చేసుకునేవారు. జిల్లాలో బాణసంచా ప్రమాదాలతో నిబంధనలు కఠినతరం చేశారు. దానిలో భాగంగా అన్ని జాగ్రత్తల నడుమ నివాసాలకు దూరంగా దేవీ సెంటర్ సమీపాన ఓ లేఅవుట్‌లో ఏర్పాటు చేశారు.

డివిజన్‌లో బాణసంచా విక్రయాలు


పి.శ్రీనివాస్

కొత్తపేట రెవెన్యూ డివిజన్లో 4 తయారీ కేంద్రాలు, 6 హోల్‌సేల్ షాపులు, 130 తాత్కాలిక లైసెన్స్ (రిటైల్) షాపులు ఉన్నాయి. ఆ విధంగా కొత్తపేట మండలంలో 4 తయారీ కేంద్రాలు, 4 హోల్‌సేల్ షాపులు, 29 రిటైల్ షాపులున్నాయి. రావులపాలెం మండలం 2 హోల్‌సేల్, 36 రిటైల్ షాపులున్నాయి. ఆత్రేయపురం మండలంలో 17, ఆలమూరు మండలంలో 13తో పాటు అయినవిల్లి, అంబాజీపేట, పి.గన్నవరం మండలాల్లో సుమారు 34 షాపులు ఉన్నాయి. హోల్‌సేల్ షాపులు గత 20 రోజుల నుంచి విక్రయాలు సాగిస్తుండగా రిటైల్ షాపుల్లో విక్రయాలకు మూడు రోజులు అనుమతి ఇచ్చారు. దాంతో శనివారం కొందరు, ఆదివారం కొందరు తమకు నిర్దేశించిన ప్రదేశాల్లో షాపులు ఏర్పాట్లు చేసుకుని విక్రయాలు ప్రారంభించారు.

అధికారుల తనిఖీలు

దీపావళి బాణసంచా హోల్‌సేల్, రిటైల్ షాపుల వద్ద నియమ, నిబంధనలు విధిగా పాటించాలని ఆర్డీవో పి.శ్రీకర్, డీఎస్పీ సుంకర మురళీమోహన్, రావులపాలెం సీఐ సీహెచ్ విద్యాసాగర్ సూచించారు. ఆ మేరకు డివిజన్, మండల స్థాయి రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖల అధికారులతో కలసి పలు హోల్‌సేల్, తయారీ కేంద్రాలను కొన్ని రోజులుగా తరచూ తనిఖీలు జరిపారు. జాగ్రత్తలు, హెచ్చరికలు చేశారు. దీపావళి దీపాల వలన గాని, బాణసంచా కాల్చేటప్పుడు గాని ఏదైనా అగ్నిప్రమాదం జరిగితే వెంటనే కొత్తపేట అగ్నిమాపక కేంద్రం 08855 243299 ల్యాండ్ నంబర్‌కు లేదా సెల్ 9963728051కు ఫోన్ చేసి సమాచారం అందించండి.

కళ తప్పిన బాణసంచా దుకాణాలు


అంబాజీపేటలో విక్రయాలు లేక కళ తప్పిన బాణాసంచా దుకాణాలు

అంబాజీపేట: ప్రజల్లో బాణసంచా కొనుగోలుకు నిరాసక్తత, ఆర్థిక భారం వంటి కారణాలతో ఈ ఏడాది బాణసంచా దుకాణాలు కళతప్పాయి. దీపావళి పండగకు కనీసం వారం రోజులు ముందు నుంచి బాణసంచా కాల్చుకోవడంతో యువకులు కళ తెప్పించేవారు. మూడు రోజులు ముందే దుకాణాలను ఏర్పాటు చేసేవారు. అయితే ఈ ఏడాది శనివారం నుంచి దుకాణాలు ప్రారంభించడం, ఎక్కడ సందడి లేకపోవడం గమనార్హం. దీనికి తోడు ఆదివారం ఉదయం నుంచి ఓపక్క వర్షం కురవడం, ఏటా దుకాణాలు ఏర్పాటు చేసే ప్రాంతంలో కాకుండా హైస్కూల్ వెనకాల వేయాలని అధికారులు మార్పు చేయడం, ఎప్పటి లాగే నిర్వహించుకుంటామని విక్రయదారులు చర్చలు జరపడం వంటి కారణాలతో బాణసంచా దుకాణాలు ఆలస్యంగా వెలిశాయి.

అయినవిల్లిలో..

అయినవిల్లి: మండలం కేంద్రమైన ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఆదివారం బాణసంచా దుకాణాలు ఏర్పాటు చేశారు. సుమారుగా 11 బాణసంచా షాపులు ఏర్పాటు చేశారు. ఈ షాపుల్లో అమ్మకాలు తొలి రోజు మందకొడిగా సాగాయి. అయితే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ షాపులు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే షామియానాలో ఈ షాపులను ఏర్పాటు చేశారు. ఈ ప్రాంతంలో ఏదైనా ప్రమాదం జరిగితే తగిన చర్యలు తీసుకునేందుకు ఏర్పాటు చేయాలి. అటువంటి ఏర్పాట్లు చేసిన దాఖలాలు కనిపించడం లేదు. ప్రభుత్వ అధికారులు ఈ షాపులను పరిశీలించి ప్రభుత్వ నిబంధనలు పాటించే విధంగా చర్యలు తీసుకోవాలి. ఇటీవల విలసలో జరిగిన ప్రమాదంలో ముందస్తుగా బాణసంచా షాపుల యజమానులు అన్ని చర్యలు తీసుకునేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.


ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే సీజ్ చేస్తాం

అంబాజీపేట: ప్రైవేటుగా నిర్వహిస్తున్న హోటల్స్, బేకరీ, చికెన్, కిరాణా షాపులతో పాటు ఇతర షాపులకు ప్రభుత్వం మంజూరు చేసే లైసెన్స్ పొంది ఉండాలని, అలా కాకుండా వ్యాపారాలు చేస్తే ఆ షాపులను సీజ్ చేస్తామని జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వై.రామయ్య హెచ్చరించారు. మాచవరానికి చెందిన 13 మంది ఫుడ్ పాయిజన్ బారిన పడి అంబాజీపేట మెడ్ యునైటెడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆదివారం రామయ్య పరామర్శించి వివరాలు సేకరించారు. అంతకు ముందు ఫుడ్ పాయిజన్ జరిగిన స్థానిక హోటల్‌ను తనిఖీ చేశారు. ఆ హోటల్‌లో ఉన్న మినపప్పు, పంచదార, ఉప్పు, మంచి నీటి శాంపిళ్లను సేకరించారు. వీటిని హైదరాబాద్, గుంటూరు ల్యాబ్‌లకు పరీక్షల నిమిత్తం పంపించనున్నామన్నారు. అక్కడి నుంచి వచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఫుడ్ పాయిజన్‌కు గురైన హోటల్‌ను సీజ్ చేశామని రామయ్య తెలిపారు. అలాగే హోటల్ పక్కన ఉన్న కిరాణా షాపు, చికెన్ షాపులను తనిఖీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో వారికి తగిన సూచనలు చేశారు. లైసెన్స్ లేని పక్షంలో తక్షణమే తీసుకోవాలని వ్యాపారస్తులకు సూచించారు.


అంబాజీపేటలో హోటల్‌ను సీజ్ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య

నిబంధనలు పాటించాలి

ఆలమూరు: దీపావళి షాపుల యజమానులు బాణసంచా విక్రయాల్లో కచ్చితంగా నిబంధనలు పాటించాలని ఆలమూరు ఎస్సై జి.నరేష్ కోరారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం ఆయన మాట్లాడుతూ మండలంలో తొమ్మిది మందికి బాణసంచా తాత్కాలిక విక్రయాలకు అనుమతిని ఇచ్చామన్నారు. అందులో ఆలమూరు 1, మడికి 1, చెముడులంక 2, చొప్పెల్ల 1, పెదపళ్ల 4 షాపులు ఉన్నాయన్నారు. అలాగే దీపావళి పర్వదినాన్ని ఆనందంగా జరుపుకోవాలని ప్రమాదాల జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

వేధిస్తున్న మురుగు నీటి సమస్య

మామిడికుదురు: మొగలికుదురు గ్రామ పరిధిలోని జగ్గన్నపేటను మురుగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోంది. వీధుల్లో రోడ్లపై మురుగు నీరు పొంగి ప్రవహిస్తోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎంతో కాలం నుంచి ఈ సమస్య ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. మురుగునీటి వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాజోలు మండలం తాటిపాక నుంచి వచ్చే మురుగునీటితోనే సమస్య జటిలంగా మారిందన్నారు. దీన్ని పరిష్కరించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.


జగ్గన్నపేటలో రోడ్డుపై ప్రవహిస్తున్న మురుగునీరు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

యానాం: నియోజకవర్గ పరిధిలో డాక్టర్ ఆరేటి యశోదానందకుమార్ స్మారకార్థం వివిధ పాఠశాలల విద్యార్థులకు స్థానిక రీజెన్సీ పబ్లిక్ స్కూల్లో నిర్వహించిన చెస్ పోటీలు ఉత్సాహంగా కొనసాగాయి. ఈ సందర్భంగా ప్రాథమికస్థాయిలో బాలురు 44 మంది, మాధ్యమిక స్థాయిలో 58 మంది, హైస్కూల్, జూనియర్ కళాశాలల నుంచి 43 మంది మొత్తం 145 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు నిర్వాహకులు రిటైర్డ్ వ్యవసాయశాఖ జేడీ కామిశెట్టి వేణుగోపాలరావు తెలిపారు.

పంట కాలువలో శవమై తేలిన మహిళ

పి.గన్నవరం: పుట్టింటి నుంచి అత్తారింటికి వస్తూ అదృశ్యమైన 34 ఏళ్ల వివాహిత పంట కాలువలో శవమై తేలిన ఘటనపై పి.గన్నవరం పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఎస్సై బి.శివకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పోతవరం శివారు మాతావారిపేటకు చెందిన కోట లక్ష్మణరావుకు, కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామానికి చెందిన పల్లవితో 10 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి పిల్లలు లేరు. భార్యాభర్తల మధ్య తరచూ వివాదాలు జరుగుతున్న క్రమంలో ఆమె సోదరుడు, తల్లి ఇక్కడికి వచ్చి సమస్యలను పరిష్కరించేవారు. ఈక్రమంలో ఈనెల 10న పోతవరం గ్రామానికి వచ్చిన తల్లిని, కుమార్తె పల్లవి బిళ్లకుర్రు గ్రామానికి తీసుకువెళ్లింది. అక్కడి నుంచి పోతవరం అత్తారింటికి వెళ్తున్నట్టు చెప్పి బయల్దేరింది. కానీ ఇక్కడికి రాలేదు. దీంతో ఆమె కోసం పరిసర ప్రాంతాలు గాలించినా, ఆచూకీ తెలియక పోవడంతో ఆమె సోదరుడు బొంతు తుక్కియ్య ఆదివారం పి.గన్నవరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే ఈలోగా అమలాపురం మండలం ఇందుపల్లి గ్రామం వద్ద పంట కాలువలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉందని తెలియడంతో అతడు అక్కడికి వెళ్లి, పల్లవి మృతదేహంగా గుర్తించాడు. అతడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై శివకృష్ణ వివరించారు.

ప్రతి ఒక్కరూ కృష్ణ చైతన్యం కలిగి ఉండాలి


శ్రీకృష్ణునికి ప్రత్యేక పూజలు చేస్తున్న ప్రభూజీ సుందర శ్రీనివాస్ తదితరులు

అయినవిల్లి: శ్రీకృష్ణుడు రాతి విగ్రహం కాదు. సాక్షాత్తూ ఆయనే రాతి (శిలా) విగ్రహం రూపంలో ప్రత్యక్షమయ్యారు. శ్రీ కృష్ణ చైతన్యం కలిగిన ప్రతి ఒక్కరికీ ఇది బోధపడుతోందని మండలంలోని నల్లచెరువు అంతర్జాతీయ శ్రీకృష్ణ మందిర్ నిర్వాహకుడు ప్రభూజీ సుందర శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం నల్లచెరువులో అంతర్జాతీయ శ్రీకృష్ణమందిరంలో శ్రీకృష్ణ ప్రభూజీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశేష అభిషేకాలు, పూజలు జరిపారు. సుందర శ్రీనివాస్‌దాస్ ప్రభూజీ మాట్లాడుతూ శ్రీకృష్ణ భగవానుడిని నిత్యం ఆరాధించాలని అన్నారు. శ్రీకృష్ణ ఆలయ పరిసరాల్లో ఉండి స్వామి జపం నిత్యం చేయాలన్నారు. ఎల్లప్పుడూ ఆయన పైనే ఆధారపడి ఉండాలన్నారు. ఇదే భక్తి మార్గమన్నారు. అనంతరం మందిరం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు.

గాయపడిన బాధితుడి వైద్యానికి సాయం


బాధితుడికి సాయం అందజేస్తున్న సంస్థ సభ్యులు

రావులపాలెం: ప్రమాదవశాత్తూ పొయ్యి మీద నుంచి కూర మీద పడటంతో గాయపడిన బాధితుడి వైద్యానికి స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులు రూ.12 వేలు ఆదివారం అందజేశారు. గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్ (36) స్థానికంగా ఒక టిఫిన్ హోటల్‌లో వంట పని చేస్తారు. కొద్ది రోజులు క్రితం పొయ్యి మీద నుంచి కూర గిన్నె దింపుతుండగా జారి పడిపోవడంతో వేడి వేడి కూర మీద పడిపోయి చెయ్యి, కొంత శరీరం కాలిపోయాయి. పనికి వెళితే కానీ కుటుంబం గడవని పరిస్థితి, వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో కాశీ అన్నపూర్ణాదేవి సేవా సంస్థ సభ్యులను సాయం కోరారు. రావులపాలెంలో ఇమ్రాన్ ఇంటికి వెళ్లి సంస్థ సభ్యుల చేతుల మీదుగా రూ.12 వేల చెక్కు అందజేశారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి


నరసింహారావు (ఫైల్)

మామిడికుదురు: లూటుకుర్రు జెడ్పీహెచ్ స్కూల్లో ఎస్జీటీగా పని చేస్తున్న మామిడికుదురుకు చెందిన ఉపాధ్యాయుడు కాగితాల పల్లి నరసింహారావు (46) శనివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. గుండెపోటుకు గురైన అతన్ని చికిత్స కోసం రాజమహేంద్రవరం ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ నరసింహారావు మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆదివారం తెలిపారు. నరసింహారావు మృతికి డీఈఓ. షేక్ సలీంబాషా ప్రగాఢ సానుభూతి తెలిపారు. నరసింహారావు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఎంఈఓలు లక్ష్మీనారాయణ, మోకా వెంకన్నబాబు, పలు ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు నరసింహారావు మృతికి సంతాపం తెలిపి, అతని కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలియజేశారు.

వివాహిత అదృశ్యంపై కేసు

ముమ్మిడివరం: వివాహిత అదృశ్యంపై ఆదివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై డి.జ్వాలా సాగర్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన వివాహిత (27) శనివారం ఉదయం గుడికి వెళుతున్నానని ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఆచూకీ కోసం గాలింపు చేపట్టినా ఫలితం లేకపోవడంతో భర్త మహేష్ ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

కార్తికం.. కమనీయం

- అంతటా శివనామస్మరణ
- నెలరోజులూ ఆధ్యాత్మిక శోభ
- ముస్తాబైన శైవక్షేత్రాలు
- ఈనెల 22 నుంచి కార్తికమాసం


ఆలమూరులో శతాబ్దాల చరిత్ర కలిగిన విక్రమ భట్టీశ్వరస్వామి ఆలయం


కార్తిక మాసం సందర్భంగా దీపాలు వెలిగిస్తున్న భక్తులు (ఫైల్)

ఆలమూరు: హిందువులకు అత్యంత ప్రీతికరమైన కార్తికమాసం బుధవారం నుంచి ప్రారంభమవుతుంది. శైవక్షేత్రాలన్ని పూజలందుకునేందుకు కనువిందు చేసే దేదీప్య కాంతులతో ముస్తాబు కావడంతో అంతటా ఆధ్యాత్మిక శోభ సంతరించుకోనుంది.

ఈనెల రోజులు అన్నసమారాధనలు, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో భక్తుల సందడి నెలకొంటుంది. ప్రసిద్ధ శివాలయాల్లో హోమాలు, బిల్వార్చనలు, లక్షతులసి దళ పూజలు నిర్వహించేందుకు దేవదాయశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఈనెల రోజుల పాటు భక్తులు అత్యంత నియమ నిష్ఠలతో ఆధ్యాత్మిక చింతనతో ఉపవాస దీక్షలు చేపట్టి శివపురాణం పఠించనున్నారు.

అలాగే కులమతాలకు అతీతంగా కార్తిక వన సమారాధనలకు ఈ కార్తికమాసం వేదిక కానుంది. గౌతమీ, వశిష్ఠ, వైనతేయ నదీతీరాల వెంబడి భక్తులతో కార్తిక సందడి నెలకొంటుంది.

కార్తికమాసం.. అతి పవిత్రం..

తెలుగు మాసాలన్నిటి కంటే కార్తికమాసాన్ని ప్రజలు పరమ పవిత్రంగా భావించి శివకేశవుల కరుణాకటాక్షాల కోసం భక్తిభావంతో పూజిస్తారు. కార్తికమాసంలో అన్నదానానికి అత్యంత ప్రాముఖ్యత ఉండటంతో భక్తులు వన సమారాధనలకు ప్రాధాన్యం ఇస్తారు. దీంతో కార్తికమాసం నెల రోజులు ఎక్కడా చూసినా అన్న సమారాధనలే దర్శనమిస్తుంటాయి. ఈనెల రోజులూ భక్తులు శంకరుణ్ణి కొలుస్తూ ఆధ్యాత్మిక భావంతో తన్మయత్వం చెందుతారు. హిందూ మతాచార తిథుల ప్రకారం దీపావళి పండగ మరుసటి రోజే వచ్చే కార్తిక మాసం నెల రోజుల పాటు భక్తి భావంతో శివ పరమాత్ముడికి పూజలు నిర్వహించడం పరిపాటి. ఈఏడాది అమావాస్య తిథులు మిశ్రమంగా ఉండటంతో ఈ ఏడాది కార్తికమాసం మంగళవారం సాయంకాలం ప్రవేశించింది. దీంతో భక్తులు

ఆరోజు రాత్రి ఆకాశ దీపాలను వెలిగించనుండగా బుధవారం నుంచి కార్తికమాసం పూజలు ప్రారంభించనున్నారు. మార్గశిర మాసం విష్ణుమూర్తికి, కార్తిక మాసం శివునికి ప్రీతిపాత్రమని పురాణ, ఇతిహాసాలు చెబుతున్నాయి. ఈ కార్తిక మాసంలో భక్తిశ్రద్ధలతో శివున్ని ఆరాధిస్తే సకల సౌఖ్యాలు సిద్ధించి అష్టఐశ్వర్యాలు కలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకంగా ఉంది. అతి పవిత్రమైన ఈ కార్తిక మాసంలో భక్తులు వీలైనంత శుద్ధి, శుభ్రతలను పాటిస్తూ దైవచింతన, పాపప్రీతి, దాతృత్వాలు కలిగి ఉంటారు. మాంసాహారాన్ని త్యజించి ఆధ్యాత్మిక చింతనే పరమావధిగా భావిస్తారు. నాగులచవితి, క్షీరాబ్ది ద్వాదశి, కార్తిక పౌర్ణమి వంటి ముఖ్య పర్వదినాలతో పాటు ఈమాసంలో వచ్చే నాలుగు సోమవారాలు, రెండు ఏకాదశుల పర్వదినాలు శివ భక్తులకు మరింత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు.

ప్రసిద్ధ శివాలయాలు అనేకం..

కార్తిక మాసం శుభఘడియలు రావడంతో జిల్లా వ్యాప్తంగా గ్రామగ్రామానా నెలకొని ఉన్న శివాలయాల్లో విద్యుత్‌లంకరణ పూర్తి చేసుకుని సర్వాంగ సుందరంగా తయారయ్యాయి. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామి, పలివెల ఉమా సమేత కొప్పేశ్వరస్వామి, మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి, ఆలమూరులో శతాబ్దాల ఆలయ చరిత్ర కలిగిన విక్రమ భట్టీశ్వరస్వామి, పెనికేరులో స్వయంభువుగా వెలసిన ఇష్ట కాంతేశ్వరస్వామి, కోటిపల్లిలోని విశ్వేశ్వరస్వామి, జొన్నాడలో దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, మడికి, నర్శిపూడి గ్రామాల్లో వేంచేసిన బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి, చొప్పెల్లలోని పార్వతీ మల్లేశ్వరస్వామి ఆలయాలతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న శివాలయాలు ప్రత్యేక ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనున్నాయి. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా దేవదాయశాఖ ఇప్పటికే ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.